## దైవప్రేమలో జీవించండి, లౌకిక ప్రేమలో కాదు

ప్రేమస్వరూపులారా!

ప్రపంచములో మనము ఎన్నియో చూస్తున్నాము. ఎన్నియో అనుభవిస్తున్నాము. అయితే మానవుని అంతటి గొప్పవాడు, ప్రజ్ఞావంతుడు, విజ్ఞుడు ఎక్కడా కనిపించటం లేదు. కనుకనే, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ప్రతి వస్తువునందు కూడను పంచభూతములున్నవి. పశు, పక్షి, మృగాదులయందు, వృక్షములయందు, క్రిమికీటకాదులందుకూడను ఈ పంచభూతములున్నవి. ఇవే పంచభూతములు మానవునియందుకూడను వున్నవి. కాని, మానవుడు వాటిని సద్వినియోగపరచుకోటం లేదు.

ఈనాటి మానవుడు 'నాలెడ్జి'ని సముద్రమంత విశాలంగా అభివృద్ధి చేసుకుంటున్నాడు. 'కామన్‌సెన్సు'ను హిమాలయ పర్వతములవలె పెంచుకుంటున్నాడు. ఇంత నాలెడ్జి, కామన్‌సెన్సు వుండినప్పటికీ ఈనాటి మానవునిలో విచక్షణా శక్తి జీరో! 'ఇది మంచిదా? చెడ్డదా? ఇది చేయదగినదా? చేయదగనిదా?' అనే విచక్షణ శూన్యమైపోతున్నది. అందువల్లనే, మానవత్వము ఈనాడు పూర్తి క్షీణించిపోతున్నది. మానవతా విలువలు విచక్షణా జ్ఞానంలోనే యిమిడి వుంటున్నవి. అది లేనప్పుడు ఎన్ని వుండి ప్రయోజనమేమిటి? ఈనాడు ఎక్కడికి వెళ్ళినా ప్రతిదానికి కూడను డబ్బు, డబ్బు, డబ్బు! మానవుడు డబ్బును అమితంగా పెంచుకుంటున్నాడు. కాని, విచక్షణా జ్ఞానమును ఉపయోగించి, ఆ డబ్బు తనకు అవసరమా, కాదాఅనే విషయాన్ని ఏమాత్రమూ విచారించటం లేదు.

(భగవాన్ తమ కర్చీఫ్ చూపుతూ) ఇది ఏమిటి? ఒక వస్త్రము. ఇది వస్త్రము ఎట్లయింది? దారములయొక్క చేరిక వల్లనే అయింది. ఈ దారములు ఎక్కడనుండి వచ్చాయి? ప్రత్తినుండి వచ్చాయి. మొదటిది ప్రత్తి, రెండవది దారము, మూడవది వస్త్రము. ఈ మూడూ చేరి ఒక్కటే! అదేవిధంగా **you are not one person, but three- the one you think you are, the one others think you are, the one you really are.** కనుకనే కృష్ణుడు చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' అంటే అందరుకూడను దైవముయొక్క అంశములే! మీరందరూ దైవాన్ని వెతుకుతూ వున్నారు. కాని, వెతుకనక్కరలేదు. నీవే దైవం. 'ఇంటియందు దీపము వెలుగుచునుండగా పరుల ఇంటికి అగ్గికై అరుగనేల?' అదేవిధముగనే, నీవే భగవంతుడై వుండగా తిరిగి భగవంతునికోసం వెతకటమెందుకు!

కేవలం ఇంద్రియాభిమానముచేత, దేహాభిమానముచేత మానవుడు 'నేను, నాది' అనే భ్రాంతిలో మునిగి పోతున్నాడు. దేహాభిమానంవల్ల, **attachment** ఏర్పడుతున్నది. ఈ దేహము ఎంతవరకు? ప్రాణమున్నంతవరకే నీవు దేహాన్ని ఆశిస్తున్నావు. ప్రాణం పోతూనే దానిని నిర్దాక్షిణ్యంగా నిప్పులో వేస్తావు. అప్పుడు ఆ దేహం ఎవరిది? 'ఇది నా దేహం, నా మైండు, నా బుద్ధి, నా చేయి, నా కాలు.....' అంతా 'నాది, నాది, నాది' అంటున్నావు. 'నా దేహము' అన్నప్పుడు దేహము వేరు, నీవు వేరు. మరి నీవెవరు? దేహము నీవు కాదు. ఇంద్రియములు నీవు కాదు. బుద్ధి నీవు కాదు. నీవు నీవే' అదే 'I' (నేను) అది ఒక్కటే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' ఆ 'అహం' కు ఆకారాన్ని చేర్చినప్పుడు అదే అహంకారం. ఆ 'I' తలకొట్టేస్తే 'క్రాస్' అవుతుంది. దానినే క్రిస్టియన్సు పూజిస్తున్నారు. అనగా, అహంకారమును త్రుంచివేస్తే నీవు నీవవుతావు. నీవు మానవుడు కావు. నీవే దైవం. కాబట్టి, దైవాన్ని వెతుకవలసిన అవసరమే లేదు. భగవంతుడు ఎక్కడ చూసినా వున్నాడు. ఈ వస్త్రము దైవమే. ఈ పుష్పము దైవమే. ఈ టేబుల్ దైవమే. సర్వమూ దైవమే. కేవలము అజ్ఞానము చేత 'నేను, నీవు' అని భేదములు ఏర్పడుతూ వచ్చినవి. ఎప్పటికీ నేను వేరు, నీవు వేరు కాదు. నేను సత్యసాయిబాబాను కాదు. నేను నేనే. సత్యసాయిబాబా అనేది కేవలము ఈ దేహానికి పెట్టిన పేరు. కాని, నాకు ఎట్టి పేరూ లేదు.

అన్ని దేహములలోను పంచభూతములు, పంచప్రాణములు, పంచేంద్రియములు... ఇవన్నీ వున్నాయి. కాబట్టి,

అందరూ సమానమే. నీవు ప్రత్యేకమైనటువంటి వాడవు కావు. కాని, ఆధ్యాత్మిక తత్త్వము తెలియనివారు అనేక భ్రమలలో మునిగి అజ్ఞానంతో అవస్థపడుతున్నారు. 'నాలోనే వున్నాడు భగవంతుడు' అన్న నమ్మకం పెట్టుకో. ఆ నమ్మకం వున్నప్పుడే నీ నిజమైన రూపం నీకు కనిపిస్తుంది. భగవంతునిపైన విశ్వాసము వున్నటువంటివానికి ప్రేమ పుడుతుంది. ప్రేమ వున్నటువంటి వానికి శాంతి ఏర్పడుతుంది. శాంతి ఏర్పడినప్పుడు సత్యము ఆవిర్భవిస్తుంది. ఈ సత్యమే దైవం. సత్యమనేది ఎక్కడో పుట్టించనటువంటిది కాదు. సత్యమునకొక రూపము లేదు. సత్యము సత్యమే. శాంతి శాంతియే. దానికీ రూపము లేదు. అట్లే, ప్రేమ ప్రేమయే. ప్రేమను ఎవరూ పుట్టించలేదు. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. మానవతా విలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు రూపరహితమైనటువంటివి. ఇవి మన హృదయములోనే హత్తుకొని వున్నాయి. ఈనాడు మనము చదివే చదువులు, వ్రాసే వ్రాతలు...ఇవన్నీ భౌతికమైన, లౌకికమైన చదువులేగాని నిజమైన చదువులు కావు. నిజమైనటువంటి చదువు 'ఎడ్యుకేర్' లోపల వున్నటువంటి దానిని బయటికి తీయటమే. సత్యము, శాంతి, త్యాగము ఇత్యాది మానవతా విలువలు మన హృదయంలో వున్నాయి. కాని, అవి నీకు కనిపించటం లేదు. వాటిని వెతికి బయటికి తీయాలి. అదే నీవు చేయవలసిన సాధన.

మీరు మెడిటేషన్ చేస్తారు. జపము చేస్తారు. కాని, ఈ జపము వలన మీకు ఏమి తెలుస్తున్నాది? కేవలం మాల త్రిప్పటమే తెలుస్తున్నది. ఇది కాదు సాధన. ఇవన్నీ మనము కల్పించుకున్నటువంటి కృత్రిమ సాధనలేగానీ సత్యమైనవి కావు. ఈనాటి సైన్సుకూడను అటువంటిదే! ఈ సైన్సు 'సెన్సెస్' నుండి వచ్చినటువంటిదే. 'సెన్సెస్' లేకపోతే 'సైన్సే' లేదు. దైవము ప్రత్యేకముగా లేడు. దైవము మీయొక్క సత్యమునుండియే మీకు సాక్షాత్కరిస్తాడు. కనుక, మీరు అనవసరమైన సాధనలు చేసి కాలము వ్యర్థం చేసుకోకండి. కాలమును వ్యర్థం చేసినప్పుడు జీవితమే వ్యర్థమైపోతుంది. సత్యమునే మన లక్ష్యముగా పెట్టుకున్నప్పుడు మనకు ఏదీ అడ్డు వుండదు.

ఈ చిన్న వయస్సులో మీ ఇంద్రియాలు చాలా బలంగా వున్నాయి. మనోబుద్ధులు చూస్తే చాలా చురుగ్గా వున్నాయి. ఇంత శక్తి వుండికూడను మీరు ఎందుకింత బలహీనులౌతున్నారు? దీనికి కారణం? మీరు కృత్రిమమైన జీవితం గడుపుతున్నారు. మీ అందరిలోనూ ప్రేమ వున్నది. ప్రేమ కేవలం మీ సొత్తు కాదు. అది అందరి సొత్తు. నాలో, నీలో అందరిలోనూ ప్రేమ వుంది. కాని, ఈ ప్రేమకు అనేక పేర్లు పెట్టి అనుభవించుకోటానికి మీరు ప్రయత్నిస్తున్నారు. ఎవరిని ప్రేమించినప్పటికి కేవలం 'ఆర్టిఫిషియల్'గా ప్రేమిస్తున్నారు. మీరు మరోవిధంగా భావించకూడదుగాని ఇప్పుడు మగపిల్లలుగాని, ఆడపిల్లలుగాని కేవలము అల్పతృప్తి నిమిత్తమై ఒకరినొకరు ప్రేమిస్తున్నారు. అది కృత్రిమమైన ప్రేమ. కొంత కాలము వుంటుంది, తరువాత పోతుంది. అంతేకాదు, మానవుని బలహీనుని గావిస్తుంది. ఈ బలహీనత వల్ల అనేక రోగములు ప్రారంభమౌతాయి. ఈ ప్రేమతత్త్వమనేది ముఖ్యంగా యువతీయువకులకు చెప్పవలసినటువంటి విషయము. ప్రేమతత్త్వము కేవలము దైవత్వమే తప్ప అన్యము కాదు. దేవునినుండి వచ్చినటువంటి ప్రేమతత్త్వమునే మనం అందుకోవాలి. ఇతరులనుండి వచ్చినటువంటిదానిని తీసుకోకూడదు. దైవాన్ని ప్రేమించండి. అదే నిజమైన ప్రేమ. అదిగాక మీరు దేనిని ప్రేమించినప్పటికీ అది సత్యము కాదు.

ప్రేమస్వరూపులారా! మీరు ఎన్నియో సాధనలు చేస్తున్నారు. ఎన్ని చేసినప్పటికీ మీకు సత్యము చిక్కటం లేదు. ఎంతమందిని ఆశ్రయించినా, ఎంతమందిని చేర్చుకున్నా మీకు లభించవలసిన ప్రేమ లభించటం లేదు. నిజమైన ప్రేమ దైవమునుంచే ఆవిర్భవిస్తుంది. దైవము ప్రేమస్వరూపుడు. మీరు ఆ దేవప్రేమలో నిలవాలిగానీ, లౌకికప్రేమలో కాదు. ఇప్పటికే కాలాతీతమైపోయింది. మీకు శ్రమ కలిగిస్తున్నాను. ఇక ఇంతటితో నా ప్రసంగాన్ని విరమించి ఈ ప్రేమతత్త్వాన్ని గురించి మున్ముందు చక్కగా వివరించి చెబుతాను. భగవంతుడు మీకు సులభంగా చిక్కుతాడు. ఈ ప్రపంచములో ఏమాత్రం టైము తీసుకోకుండా, ఏమాత్రం శ్రమ లేకుండా లభించేది దైవము ఒక్కడే. దైవప్రేమను మించినది ప్రపంచములో మరొకటి లేదు. ప్రేమ అనే పదము చాలా చిన్నదిగా కనిపిస్తుందిగాని, ఇది

చిన్నది కాదు, పర్వతము వంటిది. సముద్రమువంటిది. ఇది ఏమాత్రం వెలితి కాదు. తరిగిపోదు. అటువంటి ప్రేమతత్త్వాన్ని మీరు గుర్తించుకోవాలి. ప్రేమతత్త్వాన్ని చెప్పాలంటే ఎవ్వరికీ సాధ్యము కాదు. ఎందుకంటే, ఒక్కొక్కరి స్థితిగతులు, అనుభవాలు ఒక్కొక్క రీతిగా వుంటాయి. కనుక, ఎవరూ చెప్పలేరు. నేను దీనిని చక్కగా వివరించి చెబుతాను.